## ✧•✧•✧ 16 ✧•✧•✧

# యేసు ముఖములోనికి చూచుట

*"అందుకు పేతురు - 'ఓయీ, నీవు చెప్పినది నాకు తెలియదనెను.' అతడింకను మాటలాడుచుండగా, వెంటనే, కోడి కూసెను. అప్పుడు ప్రభువు తిరిగి పేతురువైపు చూచెను గనుక పేతురు - 'నేడు కోడి కూయక మునుపు నీవు ముమ్మారు నన్ను ఎరుగనందువని' ప్రభువు తనతో చెప్పిన మాట జ్ఞాపకము చేసికొని, వెలుపలికిపోయి సంతాపపడి యేడ్చెను" (లూకా 22:60-62; మత్తయి 26:69-75; మార్కు 14:54, 66-72; యోహాను 18:15-18, 25-27 చూడుము).*

యేసు సిలువవేయబడిన దినము శుక్రవారమునాడు తెలతెలవారుచుండిన సమయములో, అందరు అభ్యంతరపడినను తాను మాత్రం ఎన్నడును ఆయనను గూర్చి అభ్యంతరపడడని ప్రగల్భంగా పలికిన అతని వాగ్దాన పూర్వక అతిశయోక్తులను పేతురు అతిక్రమించి (మత్తయి 26:33-35) యేసును ఎరుగనని ముమ్మారు తీవ్ర ఆవేశముతో

బొంకాడు. మూడవసారి బొంకిన తరువాత, అతడు కోడి కూయుట వినుట మాత్రమే గాక, యేసు ముఖములోనికి కూడా చూడవలసి వచ్చింది. అతడు కన్నులెత్తి చూచినప్పుడు ఆయన చూపు హృదయములను శోధించు యేసు కనుచూపుతో కలిసిపోయింది, పేతురు దీనిని తట్టుకొనలేకపోయాడు. పెద్దగా నుండిన అతని హృదయము చిన్న చిన్న ముక్కలై పోయింది. అతడు తీర్పులు జరుగుచుండిన చోటు నుండి త్వరత్వరగా బయటికి పరుగెత్తుకొని వెళ్ళిపోయి, అతని ఘనమైన విఫలత్వము గూర్చి దేవుని యెదుట విలపించాడు.

గెత్సేమనే తోటలో చేసిన ప్రార్థనలో వేదనతో కూడిన ఒక రాత్రి గడుపకు మునుపు, వారు ఆయనను ఒంటరిగా విడిచిపెట్టి పారిపోవుదురని యేసు తన శిష్యులతో చెప్పాడు (మత్తయి 26:31; యోహాను 16:32 చూడుము). యేసు పట్టబడినప్పుడు, వారు సరిగ్గా ఆయన ముందుగానే చెప్పినట్లు చేశారు. “వారందరు ఆయనను విడిచి పారిపోయిరి” అని మార్కు వ్రాయుచున్నాడు (మార్కు 14:50). పేతురు తన కత్తిని తీసి వరలో ఉంచవలసినదని యేసు అతనితో చెప్పిన తరువాత (మత్తయి 26:52; యోహాను 18:11) పట్టుకొనుటకు వచ్చిన అధికారులు మరియు బంట్రౌతులు ఆయనను తీసికొనిపోవుటకు సిద్ధముగా ఉండిరి. గనుక శిష్యులు యిదే అనువైన సమయమనుకొని తప్పించుకొనిపోయారు. అది అంధకారము అలుముకొనియుండిన సమయము గనుక వారు అదే అదనుగా నలువైపులా చెదరిపోయారు. పేతురు యోహానులు యేసు మరియు, మిణుకు మిణుకుమనుచూ వెలుగుచుండిన కాగడాలు చేతపట్టుకొనియుండిన జనసమూహము, కెద్రోను వాగు దాటి వెళ్లుచు యేసు యొక్క మొదటి తీర్పు నిమిత్తమై ప్రధాన యాజకుడైన అన్న ఇంటి దాపునకు వెళ్లుట గమనించుచుండిరి. అప్పుడు, వారు కోల్పోయిన మానసిక ప్రశాంతతను కూడగట్టుకొని, కలుగుచుండిన భయమును ప్రక్కకు నెట్టివేసి ఊరేగింపుగా వెళ్లుచుండిన జనసమూహమునకు వెనుక వారి భద్రతను గమనించుకొంటూ కొంచెము దూరముగా ఉంటూ వెళ్లుచుండిరి (యోహాను 18:15; మత్తయి 26:58; మార్కు 14:54 చూడుము).

వారు యేసును తీసుకొని వెళ్లిన ఇంటికి యెదురుగా ఉన్న న్యాయస్థానము చేరుకొన్నప్పుడు, ఇక ఇప్పుడు ఏమి జరుగునో యని ఆశ్చర్యపడుచూ, వీరు ఇతరుల మధ్య ఎక్కడో ఒక చోట నిలబడి యుందురు, యోహాను తలుపు దగ్గర కాపలాగా నిలువబడి యుండిన అమ్మాయిని సమీపించి న్యాయస్థాన ప్రాంగణములోనికి వెళ్లడానికి అనుమతించుమని అడిగాడు. యోహాను ప్రధాన యాజకునికి సుపరిచితుడే గనుక తలుపు దగ్గర నిలువబడి యుండిన అమ్మాయి అతనిని గుర్తించింది (యోహాను 18:17). ముందువెనుకలాలోచించకుండానే, ఇంటి ముందుర ఉండిన విశాల ప్రాంగణములోనికి అమె యోహానును ప్రవేశింపజేసింది. కొంత సేపటికి, “అయ్యో, పేతురు తానెక్కడ ఉండాలో, ఏంచేయాలో తెలియక మతిచెడినవాని వలె వెలుపలనే ఉండిపోయాడే” అని యోహాను గుర్తుచేసుకొని యుంటాడు. ప్రధానయాజకునికి పరిచయముండిన “ఆ శిష్యుడు” (అనగా, యోహాను), బయటికి వచ్చి ద్వారపారకురాలితో మాటలాడి, పేతురును లోపలికి తోడుకొనిపోయినది, ఈ సమయములోనే (యోహాను 18:16) వారు ద్వారము గుండా వెళ్లుచుండినప్పుడు, ద్వారపారకురాలిగా నున్న బానిసయైన ఒక చిన్నది, “నీవును ఈ మనుష్యుని శిష్యులలో ఒకడవు కావా?” అని పేతురుతో అన్నది (యోహాను 18:17బి). పేతురు, బహుశ భయముతో కూడిన ఉద్రేకముతో, “నేను కాను” అని జవాబిచ్చాడు (యోహాను 18:17సి).

అది చలిగా నున్న రాత్రి, న్యాయస్థాన ప్రాంగణములో నున్నవారు ఎదురుచూచుట తప్ప ఏమియు చేయలేకుండిరి. అన్న ఇంటిలో జరుగుచుండిన విచారణ ఫలితము కొరకు వేచియుండి, న్యాయస్థాన ప్రాంగణములో కూర్చోని లేదా నిల్చోని యున్నవారు చలికాచుకొనుటకు బొగ్గులకు నిప్పంటించి, ఒక చిన్న మంట చలికాచుకొనుటకు పేతురు ఆ మంటకు దగ్గరగా వచ్చాడు (యోహాను 18:25). బహుశ అప్పుడప్పుడు అతడు చతికిలబడి దాని ప్రక్కలోనే కూర్చోనియుంటాడు, కొన్నిసార్లు నిలబడి యుంటాడు. పేతురు చలికాచుకొనుచుండగా, మంట కొంచెము పెద్దదైనందువలన ఏర్పడిన వెలుతురు పేతురుపై పడింది. గనుక ఆతడు ఆ వెలుగులో స్పష్టంగా కనిపించాడు.

ప్రధాన యాజకుని ఇంటిలోని పనిమనుష్యులలో ఒక చిన్నది పేతురును చూచి, “నీవును గలిలయుడగు యేసుతో కూడ ఉంటివి గదా” అని అన్నది (మత్తయి 26:69). ఆ చిన్నది పలికిన పలుకులు వినబడగల దూరములోనున్న ప్రతి ఒక్కరి యెదుట, పేతురు “నేనుండలేదు; నీవు చెప్పు సంగతి నాకు తెలియదు” అని నిరాలోచనగా జవాబిచ్చాడు (మత్తయి 26:70). బహుశ ఆ మంటకు చుట్టుప్రక్కల ఉండినవారు, “నీవును ఆయన శిష్యులలో ఒకడవు కావా?” అని ఆ చిన్నదానితో శ్రుతి కలిపారు (యోహాను 18:25ఎ). అందుకు పేతురు, “నేను కాను, నేనెరుగను” అని ఘోషించాడు (యోహాను 18:25బి). ఈ ప్రశ్నల చేత మనస్తాపముచెంది ఇబ్బంది పడి, అందరి దృష్టిని ఆకర్షించినవాడై, ముఖ్యముగా వేయబడిన ప్రశ్నలకు అతడిచ్చిన జవాబులనుబట్టి, పేతురు నెమ్మదిగా మంట దగ్గర నుండి తప్పుకొని, సులభంగానే అనామకుడు అవగలడని ఆశిస్తూ, ఆ ప్రాంగణములో నుండి జారుకొని, బయటికి వెళ్ళిపొయాడు. కొంచెము సమయము గడిచిపోయింది, ప్రశ్నల వర్షం మరొకసారి కురిసింది. “నీవును వారిలో ఒకడవు!” అనంటూ మరొకడు పేతురును సమీపించినప్పుడు పేతురు, “ఓయీ, నేను కాను” అని టక్కున జవాబిచ్చాడు (లూకా 22:58). దగ్గరలో ఉండిన మరొక పనిపిల్ల, “వీడు వారిలో ఒకడు!” అని చుట్టుప్రక్కలవారికి తెలియజెప్పింది (మార్కు 14:69). పేతురు అది సరికాదంటూ (మార్కు 14:70ఎ) ఒట్టు పెట్టుకొంటూ తన సమాధాన స్వరమును మార్చాడు (మత్తయి 26:72; KJV). పేతురు ఇలా చెప్పియుండవచ్చును: నేను దేవుని ముందు నిలబడి మీతో చెప్పుచున్నాను, “నాకు ఆ మనుష్యుడు తెలియదు” లేక “దేవుడే నాకు సాక్షి; నేను నిజమే చెప్పుచున్నాను - నాకు ఆయన తెలియదు” (మత్తయి 26:70, 71 చుడుము).

పేతురు ఆయనను ఎరుగనని ముమ్మారు బొంకునని ముందుగానే చెప్పినప్పుడు, మన ప్రభువు, ఈ నాలుగు సమాధానములను ఒక్క బొంకులో - రెండవ బొంకులో - జోడించి యుండును. పేతురు ఇటువంటి వేర్వేరు నలుగురు చేసిన నాలుగు ఆరోపణలకు జవాబులిచ్చాడు. వీటిలో మూడు ఆరోపణలు ముగ్గురు వ్యక్తులు–ఇద్దరు పనిపిల్లలు, ఒకటి ఒకడు; నాల్గవది మంట చుట్టు కూడుకొనియుండినవారు చేసిన ఆరోపణ.

ఒక గంట సమయము గడిచిన తరువాత (లూకా 22:59), దారినపోయే దానయ్యలాంటివాడొకడు “నిజముగా వీడును అతనితో కూడ ఉండెను, వీడు గలిలయుడు” అని “దృఢముగా చెప్పెను” లేక మొండి పట్టుతో పలికాడు (లూకా 22:59). ఇంతలో మరొకడు, “... నీ పలుకు నిన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నది” అని పేతురుతో అన్నాడు (మత్తయి 26:73). అందుకు పేతురు, “ఓయీ, నీవు చెప్పినది నాకు తెలియదు” అని

అన్నాడు (లూకా 22:60ఎ). "ఆ మనుష్యుని నేనెరుగనని చెప్పి శపించుకొనుటకును ఒట్టుపెట్టుకొనుటకును మొదలు పెట్టెను!" అని మత్తయి వ్రాయుచున్నాడు (మత్తయి 26:74ఎ; మార్కు 14:74 చూడుము). "అతడింకను మాటలాడుచుండగా, వెంటనే కోడి కూసెను" (లూకా 22:60బి). సుప్రభాత కావలివాడు, కోడిపుంజు, పేతురు చివరి బొంకును చరిత్రగా వ్రాయుచూ యేసు పలికిన ప్రవచనము సంపూర్తిగా నెరవేరుచున్నదని ప్రకటించుచూ, కూయుట కొద్ది దూరములో వినబడినది. అతనిని యేసు నుండి ఏదియు ఎడబాపనేరదని అతిశయోక్తిగా పలికిన జాలరి యేసును ఎరుగనని శపించుకొనుచు ఒట్టు పెట్టుకొనుచు బొంకుట ద్వారా వ్యక్తిగతముగాను బహిరంగముగాను విఫలుడయ్యాడు.

ఆ క్షణములో యేసు కయప ఇంటిలో జరిగిన విచారణ కార్యక్రమము, ఆయన యొక్క రెండవ తీర్పు, ముగిసిన తరువాత వెలుపలికి తీసుకొనిరాబడినాడు. ఆయన అధికార పూర్వక తీర్పు తీర్చబడు యూదుల మహా సభ సమావేశమైన చోటికి కొనిపోబడుచుండెను. క్షణికమైన ఆ కొద్ది సమయములో, యేసు ఒక తీర్పు నుండి తరువాతి తీర్పునకు త్వరపెట్టబడి కొనిపోబడుచుండగా, ఆయన పేతురు పైపు తిరిగి చూశాడు. పేతురు తన కన్నులు పైకెత్తి చూశాడు, ఇరువురి కనుచూపులు కలుసుకొన్నవి. "అప్పుడు ప్రభువు తిరిగి పేతురువైపు చూచెను" అని లూకా ఈ దృశ్యాన్ని కొన్ని మాటల్లో కూర్చాడు (లూకా 22:61ఎ). మనస్సును కరిగించెడు ఈ చిత్రం లూకా వ్రాసిన కథనము చేత కాలములో స్తంభించిపోయింది వారిరువురి కళ్లు కలుసుకొన్న ఆ ఒకటి రెండు క్షణములలో యేసు కనుచూపునుండి పేతురు హృదయములోనికి చొచ్చుకొని వెళ్లిన బోధ, భావావేశము, మరియు మహత్వము యొక్క పూర్తి మేర ఎంత ఉండవచ్చునోయని ఉహించుకొనుటకు లోకము మొదలుపెట్టజాలదు. పేతురు "వెలుపలికిపోయి సంతాపపడి యేడ్చెను" అని వాక్య భాగము చెప్పుచున్నదంటే అందులో ఆశ్చర్యమేమి లేదు (లూకా 22:62).

పేతురు యేసు కళ్లలోకి చూచినప్పుడు ఏంచూశాడు?

*పేతురు ఆ దైవికమైన ముఖములోనికి చూచినప్పుడు, అతడు తన తక్షణ గతము ఆయన కళ్ల ముందు మెరుపువలె కనబడుటను చూశాడు.* చివరి రాత్రి పస్కా భోజన సమయమును ఒక్కసారి గుర్తుకు తెచ్చుకొని, "ప్రభువా, నాకైతే ఇక్కడున్న ఇతర సహోదరుల గూర్చి తెలియదు గాని, నాకు మాత్రం నేనేంచేస్తానో తెలియును. నేను నీతో కూడా చెరసాలకు వెళ్తాను, అవసరము వచ్చినట్లయితే నీతో కూడా మరణిస్తాను. ఒక విషయంలో నీవు నన్ను నమ్మవచ్చును: నిన్ను ఎరుగనని నేనెన్నడూ బొంకను" అని చెప్పినట్లు ఊహించుకొన్నాడు (మత్తయి 26:33 చూడుము). అతడేమి చెప్పుచుండెనో దానిలో దాగియున్న భావమేమిటో పేతురు ఎరిగియుండెను మరియు యేసు పట్టబడుచుండిన సమయములో సాహసవంతమైన తన వక్కాణింపులను ప్రదర్శించాడు కూడ. తన కత్తిని వరలో నుండి తీసి దానిని విదిలించి మల్కు ముఖము వైపు దూసి, ఆ దాసుని చెవిని తెగనరికాడు. ఒక్కసారి తన కత్తిని ఉరవడిగా ఆడించుట ద్వారా వాస్తవముగానే అతడు తన ప్రాణాలకు మరియు ఇతరుల ప్రాణాలకు తెగించాడు. అతడు తన కత్తిని తిరిగి వరలో పెట్టవలసినదే అని యేసు ఆజ్ఞాపించుట పేతురు హృదయములో, దానిని దూకుడుతనము, పట్టుదలగల హృదయమునుండి ఖచ్చితముగా తెలియని, తికమకపడిన దానిగా తగ్గించుచు, వాని హృదయములో చలనము కలుగజేసియుండును, జరుగబోయేదానంతటి గూర్చి యేసు

వివరించి చెప్పిన విషయాలన్నింటిని పేతురు పూర్తిగా అర్థంచేసుకొనలేదు. అటుతరువాత, న్యాయస్థాన ప్రాంగణము యొక్క ద్వారములోను చలికాచుకొనుచుండిన మంట యొద్దను, అతనికిని యేసునకును గల సంబంధము గూర్చిన సత్యమును కోరుచుండిన భీకర ప్రశ్నల పరంపర యెదుట సంపూర్తిగా కరిగిపోయాడు. అతడు ఇంతకు మునుపెన్నడూ లేనంతగా ఓటమిపాలయ్యాడు. బహుశ తీవ్ర మానసిక యాతన కలుగజేయుచుండిన: "ఈ మనుష్యుని నేనెరుగను" అని నేనెందుకు చెప్పియుంటాను? "నేను ఆ సమాధానములను అంత స్పష్టముగాను, వేగిరముగాను, మరియు నచ్చజెప్పుచున్నట్లుగాను ఎలా చెప్పియుంటాను?" మొదలైన ప్రశ్నలచేత అతని మనస్సు కుదిపివేయబడి యుండును.

*దీనికి తోడుగా, పేతురు యేసు ముఖములోనికి చూచినప్పుడు, ఆతడు ఆయన కనికరమును కళ్లారా చూశాడు.* అతనికి కలిగిన ఆశ్చర్యమునకు తగ్గట్టు, "ఓ పేతురూ, నీవేమి చేయనైయుంటివో నేను నీకు ముందుగానే చెప్పాను! ఔను, నేనలా చెప్పాను! నీవలా చేస్తావని నాకు తెలుసు!" అని యేసు యొక్క ముఖకవళికలు బోధించుచుండలేదు. పేతురు యేసు ప్రభువుతో కూడ గడిపిన మూడు సంవత్సరములలో, యేసు ఎవరి యెడలనైనను అంతటి బాధకరమైన భావాలను వ్యక్తము చేసినట్లు అతటు ఎన్నడూ చూడలేదు. పగతీర్చుకొను లేక ప్రతీకారము చేయు స్ఫూర్తిని ఆయనలో అతడు ఎన్నడూ గమనించలేదు. దానికి భిన్నముగా, ఒకడు తన సహోదరుని ఎన్ని మారులు క్షమించాలో అని యేసు బోధించుట అతడు విన్నాడు: "ఏడుమారులమట్టుకే కాదు. డెబ్బది ఏళ్ల మారులమట్టుకని నీతో చెప్పుచున్నాను" (మత్తయి 18:22). "మీరు మనుష్యుల అపరాధములను క్షమింపక పోయినయెడల మీ తండ్రియు మీ అపరాధములను క్షమింపడు" అని యేసు బోధించిన విషయాన్ని అతడు జ్ఞాపకమునకు తెచ్చుకొనగలిగాడు (మత్తయి 6:15). వ్యభిచారములో పట్టబడిన స్త్రీతో "నేనును నీకు శిక్ష విధింపను; నీవు వెళ్లి ఇక పాపము చేయకుము" అని చెప్పుచుండుట అతడు వినియుండును (యోహాను 8:11). ఇప్పుడు, అతడు యేసుతో నడిచినప్పటి అదివరకటి కంటె ఎక్కువగా, ఆలోచించకుండా తొందరపాటుగా పాపములో పడిపోయిన వారి కొరకు యేసు యొక్క హృదయాంతరాళములో నుండిన గొప్ప జాలి ఆయన ముఖముపై చెక్కబడియుండుట చూచియుండును. యేసు యొక్క కళ్లు మరియు ముఖవైఖరి: "పేతురూ, నీవొక తప్పు చేశావు, కానీ దాని కొరకు ఒక క్షమాపణా మార్గమున్నది. ఆ మార్గములో వెళ్లి, దానిలోనే నడువుము. ఇంత జరిగిననూ నేను యింకా నిన్ను ప్రేమించుచున్నాను మరియు నిన్ను ప్రేమించుట నేనెన్నడూ విడిచిపెట్టను, ఈ విషయాన్ని గట్టిగా జ్ఞాపకముంచుకో" అని తెలియజెప్పుచుండినవి.

*పేతురు కళ్లు యేసు కళ్లను కలుసుకొన్నప్పుడు, అతడు తన పాపము మరియు దాని మలినమును మరియు దాని ప్రాణాంతక పరిస్థితి నంతటిని చూశాడు.* పేతురు యేసు కళ్లలోనికి చూచినప్పుడు అతడు గమనించిన అసమానతను ఎవరూహించగలరు! పేతురు, పాపియైనవాడు, యేసు, ఏ పాపము లేనివాని, ముఖములోనికి చూచుచుండెను! పేతురు, దోషియైనవాడు, తాజా బొంకుడు కుళ్లుకంపుతో కప్పబడినవాడు, యేసు దేవుని కుమారుడు, ప్రతి మానవుని దోషమును భరించుటకు వెళ్లుచుండిన మార్గములోనున్న ఆయన ముఖము లోనికి చూచుచుండెను!

పేతురు ఇటువంటి వైషమ్యమును ఇంతకు మునుపు ఎప్పుడో చూశాడు. లూకా 5వ

అధ్యాయంలో, భారీ సంఖ్యలో చేపలు పట్టిన తరువాత, యేసు యొక్క దైవత్వము గూర్చిన సత్యము అతనిని అమితోత్సాహములో ముంచివేసినది. దరి వరకు ఈదుకుంటూ వచ్చి, "ప్రభువా! నన్ను విడిచిపొమ్ము, నేను పాపాత్ముడను అని బిగ్గరగా కేకవేశాడు (లూకా 5:8). పాపము యేసు యొక్క పరిశుద్ధ స్వభావమునకు ప్రక్క ప్రక్కలోనే ఉంచబడినప్పుడు, అది దాని వికృతమునుబట్టి గాఢముగా అసహ్యించుకొనబడునదిగాను, దాని ఉద్దేశములనుబట్టి అవినీతిమయమైనదిగాను, దాని పర్యవసానమునుబట్టి నిందనీయమైనదిగాను ఉండునని నిస్సందేహముగా చెప్పుకొనవచ్చును.

సూక్ష్మ గ్రాహ్యతగల హృదయమున్నవారెవరైనను యేసు ముఖములోనికి చూచి మునుపున్న విధముగానే ఉండలేరు. యేసు యొక్క నిష్కళంకమును, జాలిగలవియు, సమస్తమును ఎరిగినవియునైన కళ్లు, మన అంతరింద్రియములను శోధించును, మనలను ఒప్పింపజేయును, మనలను నలుగగొట్టును, మరియు మనలను దేవుని ప్రేమ లోనికి ఆకర్షించును!

❖◆❖◆❖

*జేమ్స్ ఎమ్. స్టాల్కర్ ఇలా వ్రాశాడు, "వారిలో ఒక్కరు లేదా యిద్దరు – ఉదాహరణగా (పేతురు లేక) సహోదరులై యుండిన యాకోబు మరియు యోహాను – యేసుతో కూడ చెరసాలలో బంధింపబడుటకును మరణించుటకును వెళ్లుటకు చాలినంత బలముగలవారై యుండియుంటే ... క్రైస్తవత్వమునకు అది ఎంతో గొప్ప గౌరవమై యుండేదే కదా, మానవ స్వభావ చరిత్ర పుటల్లో స్వర్ణాక్షరములతో లిఖింపబడి మెరయుచున్న పుటయై యుండేదే కాదా, అదెంతో గొప్ప ప్రత్యక్షతయై యుండేదే కాదా, ఎంతో గంభీరమైన సువార్తయై యుండేదే కదా, ఎంతో ప్రఖ్యాతమైన సజీవ పత్రికయై యుండేదే కదా" అని నేను కొన్నిసార్లు అనుకొన్నాను!*

*"ఏది ఏమైనా, అది అలా సంభవించునదై యుండలేదు. ఏలయనగా ఆయన సమేతంగా ఎవరునూ లేకుండా యేసు ఒక్కడే వెళ్లవలసి యుండినది ... "*[1]

---

సూచన

[1]James M. Stalker, *The Trial and Death of Jesus Christ* (Glasgow: N.p., 1894; reprint, Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1970), 15.